# కృషి - ఫలితం



లేత ఆకుపచ్చ రంగులో ఓం కారరూపంలో ఉన్న ట్యూబ్‌లైట్ వెలుగుతున్న ఆ చిన్నహాలులోకి 'మాజీ'తో సహా అడుగుపెట్టిన నేను ఆశ్చర్యపోతూనే అక్కడి వాతావరణానికి తగ్గట్లు ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చున్నాను. (అక్కడ ఎలా ప్రవర్తించాలో 'మాజీ' నాకు ముందుగానే తర్ఫీదు ఇవ్వడంతో.) అది ధ్యాన మందిరం.

ఇష్ట దైవాన్ని హృదయపూర్వకంగా స్మరించుకున్నాను. కళ్ళు తెరిచి ఆ హాలంతా పరిశీలించాను. సాంబ్రాణి వాసన వ్యాపిస్తున్న ఆ గాలిలో ఏదో తెలియని పవిత్రత. ప్రతి ఒక్కరూ ధ్యానంలో తాదాత్మ్యం చెంది ఉన్నారు మాజీతో సహా! నాకు కన్యాకుమారిలో వివేకానంద రాక్‌లోని ధ్యానమందిరం గుర్తుకు వచ్చింది.

అంతలో గంట మోగింది శ్రావ్యంగా.

ఆ హాల్లోంచి అందరూ ఒక్కొక్కరుగా లేచి ఆ చిన్నహాలుని ఆనుకొని ఉన్న విశాలమైన పెద్దహాలులోకి వరుసలో నడవసాగారు. మాజీ నేను వారిని అనుసరించాం.

హాలంతా తివాచీలు. మధ్యలో నడవడానికి అన్నట్లు దారి వదిలి మరీ పరిచారు. తెల్లని వస్త్రాలు ధరించిన కార్యకర్తలు హాలుకు రెండు వైపులా చేతులు కట్టుకొని క్రమ పద్ధతిలో నిలబడి ఉన్నారు.

హాలు చివర ఎత్తైన స్టేజీ పుష్పాలంకరణతో అందంగా అలంకరించబడి ఉంది. చామంతులు, ముద్దబంతుల మాలలు తోరణాలుగా అమర్చారు. ఎర్రని గార్డెన్ సిల్క్ తెరతో స్టేజీ మూసేశారు.

ఆ సాయంత్రం దర్శన సమయంలో హాలు సుమారు సగం నిండి ఉంది. మళ్ళీ గంట మోగింది.

హాలులో ఉన్న భక్తులంతాఅప్రమత్తులయ్యారు.

చీమ చిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దమైపోయిందా హాలు.

నెమ్మదిగా తెరపైకి లేచింది.

రాజసింహాసనం లాంటి ఉన్నత ఆసనంపై స్వామీజీ ఆశీనులై ఉన్నారు. పీతాంబర ధారులైన ఇద్దరు స్త్రీలు ఒకరి తరువాత ఒకరు సూర్యహారతి, చంద్రహారతి ఇచ్చి పాద నమస్కారం తీసుకుని అక్కడనుంచి నిష్క్రమించారు.

అసలైన సందడి అప్పుడు మొదలైంది.

భక్తులు ఒక్కొక్కరే లేచి స్టేజీ మీదకు వెళ్ళి తమతో తెచ్చిన ఫలాలు స్వామి వారి పక్కనున్న ప్లాస్టిక్ టబ్‌లో వేసి, కానుకలు

మరోవైపు ఉన్న హుండీలో వేసి స్వామి వారి పాదదర్శనం చేసుకుని ఆ మహద్భాగ్యానికే తన్మయులై నిష్క్రమిస్తున్నారు.

మరికొందరు స్వామి వారి కటాక్షానికి పాత్రులైనట్లుగా స్వామి వారు ఎవరినైతే ఆశీర్వదించి 'ఇష్టకార్య సిద్ధిరస్తు' అంటూ తన పక్కన పళ్ళెంలో ప్రత్యేకంగా పెట్టుకున్న రకరకాల పండ్లలోంచి చేతి కందిన ఫలాన్ని వారి చేతుల్లో పెడుతున్నారో, ఆ భక్తులు తమ అదృష్టానికి పొంగిపోతూ మరింత భక్తి పారవశ్యంతో నిష్క్రమిస్తున్నారు. అటువంటి భాగ్యం తమకెప్పుడో అని మిగిలిన భక్తులు నిట్టూరుస్తూ ముందుకు సాగుతున్నారు.

చేతులు జోడించి ఉన్నానే గానీ అక్కడి ప్రతి అంగుళాన్నీ పరిశీలనా దృష్టితో పరీక్షిస్తున్న నేను 'మాజీ' వంతు వచ్చేసరికి ఆయనను అనుసరించాను.

ముందుగా 'మాజీ' తరువాత నేను స్టేజీ ఎక్కాము.

మాజీ తన కూడా తెచ్చిన టెంకాయ, చక్కరకేళీ పళ్ళు టబ్‌లో వేసి హుండీలో 116 రూపాయల దక్షిణం వేశారు.

పాద నమస్కారం తీసుకోవడానికి వంగబోతున్న మాజీని చూస్తూనే స్వామీజీ పాదాలు వెనక్కి తీసుకుని ఒక్కసారిగా హుంకరించారు.

'మూర్ఖుడా! ఆగు!''

ప్రశాంతమైన ఆ హాలు ఆ గర్జనతో ప్రతిధ్వనించింది.

స్వామీజీ చూపులు అప్పుడు పడ్డాయి నా మీద!

వాటికే శక్తి ఉంటే నేను నిలువునా భస్మమయ్యేవాడినేమో!

"నాకు ఎంతో ప్రియ భక్తుడవనుకున్నాను. నిన్నును వెంట బెట్టుకునివచ్చి ఆశ్రమాన్నే అపవిత్రం చేశావు. తక్షణం ఇక్కడనుంచి వెళ్ళు!.'' ఈ హఠాత్పరిణామానికి 'మాజీ' మ్రాన్పడిపోయాడు.

మాజీ కళ్ళనిండా గిర్రున నీళ్ళు సుడులు తిరుగుతుంటే గిరుక్కున వెనక్కు తిరిగి గబాగబా స్టేజీ దిగి ముందుసాగాడు.

నాకు ఏంచెయ్యాలో అర్థం కాలేదు. అందరూ నన్ను వింతగా చూడసాగారు. ఇంతలో ఇద్దరు కార్యకర్తలు నన్ను రెండు జబ్బలు గుచ్చి పట్టుకుని బలవంతంగా స్టేజీ దింపి ఆశ్రమం బైటకు తీసుకు వచ్చి అయోమయంగా నిలబడి కన్నీరు మున్నీరు అవుతున్న మాజీ దగ్గర నన్ను వదిలి నిర్లక్ష్యంగా నా వైపు ఓ చూపు విసిరి వెనుతిరిగి వెళ్ళారు. అంతలోనే ఒకతను వెనక్కి వచ్చి "ఎంత పనిచేశావయ్యా! నువ్వు చేసిన పనివల్ల స్వామీజీకి ఎంత కోపం వచ్చిందో చూడు. మిగతా వారందరికీ స్వామి ఆశీర్వాదం లభించకుండా చేశావు'' అనేసి వెళ్ళిపోయాడు.

ఆశ్రమం బైట, పక్కనే ఉన్న మారేడు చెట్టు చుట్టూ సిమెంటు చేసిన గట్టు మీద కూలబడి దోసిట్లో ముఖం దాచుకుని మౌనంగా రోదించసాగాడు మాజీ!

నేను తట్టుకోలేకపోయాను.

" 'మాజీ' ప్లీజ్! ఊరుకోండి. నావల్లే మీకు

స్వామీజీ ఆశీర్వాదం లభించలేదు. నన్ను క్షమించండి."

చిర్నవ్వుతో తలెత్తాడు అతను.

"నో మాస్టర్. మీరే నన్ను క్షమించాలి. మీకు నమ్మకం లేకపోయినా మిమ్మల్ని బలవంతంగా తీసుకు వచ్చి అందరిలోనూ అవమానింపబడేలా చేశాను. రియల్లీ అయామ్ సారీ!" అతని కళ్లల్లోని ఎర్రని జీరలు అతని మనసులోని లావాని తెలియజేస్తున్నాయి.

"ఎనీ హౌ"! ఇప్పట్లో మీరు స్వామీజీ అనుగ్రహం సంపాదించడం కష్టమేమో!" అన్నాను బాధగా.

"ఏమీ పర్వాలేదు మాస్టర్ ! నా వల్ల జరిగిన లోపాన్ని సరిదిద్దుకుని స్వామి అనుగ్రహం సంపాదించగలను పదండి వెళ్దాం !"

ఇంకా మాట్లాడితే అతడిని ఇంకా బాధపెట్టిన వాడినవుతానని మౌనంగా అతనిని అనుసరించాను.

★★★

మాజీ, నేను, శివశకంరం, బి.ఇడి. మేట్స్. మాజీ పూర్తి పేరు హనుమంతరావు. నేను ఏ వ్యక్తినైనా సంబోధించినప్పుడు ప్రత్యేకతగా అతనికి ఎల్లప్పుడూ నేను గుర్తుండిపోయే పిలుపుతో పిలవడం నాకు అలవాటు. అందుకే అతని పేరులోని ఒకే అక్షరం 'మ' తీసుకుని గౌరవసూచకంగా 'జీ' (గారు అనే అర్థంలో) 'మాజీ' అని పిలుస్తుంటాను. అయితే అతనూ ఆ ప్రత్యేకతను నిలబెట్టుకున్నాడు. మా ముగ్గురిలో సబ్జక్ట్‌పై పూర్తి కమాండ్ ఉన్నవాడిగా అతను నన్ను మాస్టర్ అని పిలుస్తుంటాడు.

మాలో శివశంకరం స్వతహాగా భూస్వామి. డబ్బున్నవాడు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళుఅనే నానుడిని నరనరాన ఇంకించుకున్నవాడు. తాను తప్పు చేసినా ఆపరిస్థితుల్లో అలా చెయ్యడమే కరెక్టు అని ఎదుటి వారిని కూడా నమ్మించగల ప్రతిభాశాలి. నేను, నా భావాలతో ఎక్కువగా ఏకీభవించే 'మాజీ' రూమ్‌మేట్స్ అయ్యాం.

పది సంవత్సరాల క్రితం బి.ఇడి., పూర్తిచేసిన మాకు అదృష్ట వశాత్తూ మా మండలంలోనే టీచర్స్‌గా అప్పాయింట్ మెంట్స్ రావడంతో నేనూ శివశంకరం ఒకే ఊళ్ళో పనిచేస్తూ పట్నంలో కాపురం ఉంటున్నాం. అయితే ముక్కుకు సూటిగా నా పని చేసుకుపోయే తత్వం గల నేను, తనకు తానే ఎదగాలను స్వార్థంతో మరింత ఉన్నతుడుగా ఎదిగిన శివశంకరం రోజూ పాఠశాలలో కలిసినా పెద్దగా మాట్లాడుకోం. ఎందుకో నాకే ఆ అవకాశం ఇవ్వాలని అనిపించదు.

మాజీకి తూర్పుగోదావరిలో తుని మండలంలో జాబ్ రావడం సెటిల్ అవడం వరుసగా జరిగిపోయాయి. చదువుతరువాత, విడిపోయిన మొదట్లో తీవ్రస్థాయిలో

ఏడాదిపాటు జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు వివాహాలై ఎవరి బాధ్యతలు వారి నెత్తిన పడేసరికి క్రమంగా తగ్గిపోయాయి.

ఈ మధ్య సుమారు మూడేళ్ళ కిందట మాజీ నుంచి ఓ ఉత్తరం వచ్చింది. మేము ఉంటున్న టౌన్‌కి దగ్గరగా గల 'వెంకటా పురం' అనే గ్రామంలో 'శ్రీనివాస శివరామ కృష్ణ స్వామీజీ' ఒక ఆశ్రమాన్ని నెలకొల్పి ఎందరో భక్తులకు ఈ తి బాధలు పోగొడు తున్నాడు. అనుకోకుండా ఆ మానవ రూపంలో ఉన్న దైవం గురించి తనకు తెలిసిందనీ, ప్రతి సంవత్సరం వేసవిలో జరిగే ఆయన జన్మదిన వేడుకలు, కళ్యాణం చూడడం కోసం రాష్ట్రంలో నలుమూలల నుంచి ఆశ్రమానికి వస్తారని చెప్పాడు. తన కుటుంబ సమస్యలు తొలగాలని ఆస్వామీజీని తొలిసారిగా దర్శించుకున్న మీదట పూర్తిగా పరిష్కారమయ్యాయనీ, తనకు మనశ్శాంతి లభించిందనీ వీలైతే నన్ను కూడా ఒకసారి 'స్వామీజీ' ని దర్శించమనీ ఆ ఉత్తరంలోనా సారాంశం.

ఆ తరువాత మాజీ తన కుటుం బంతో ఆశ్రమానికి వెళ్ళినపుడల్లా మా ఇంటికి రావడం నన్ను చూసి పలకరించి వెళ్ళడం. ఆశ్రమానికి రమ్మని ఆహ్వానిం చడం, నేను సున్నితంగా తిరస్కరించడం జరుగుతూనే ఉంది.

ఆధునిక కాలంలో ముమ్మూర్తులా మనలాగే మానవజన్మఎత్తి వాక్చాతుర్యం తోనో, ఇంద్రజాలంతోనో, స్వామీజీలుగా అవతరించే వారిని నమ్మి - వారిని విమర్శిస్తున్న వారి మాటలు వినలేక, అలా అని వారిపై పూర్తి విశ్వాసం లేక (వార్తాపత్రికలు, టీవీ మీడియా వల్ల) సంకట పరిస్థితిలో ఉండే వారిని ఎంతో మందిని చూశాను నేను. ఏకాగ్రచిత్తంతో ఇష్టదైవాన్ని మనస్ఫూర్తిగా ప్రార్థించు కోవడానికి ఇష్టపడే నేను, మాజీ అంటే ఎంతో అభిమానం ఉన్నా, స్వామీజీపై ఆయనకున్న అభిప్రాయంతో ఏకీభవించలేకపోయాను.

కానీ మాజీ తన ప్రయత్నం మానలేదు. ఒక్కసారి నాచేత స్వామీజీ దర్శనం చేయిద్దామన్న పట్టుదలతో ఉన్న అతనిని బాధపెట్టడం ఇష్టం లేక బయల్దే రాను. "ఆశ్రమంలో ఎవరినీ ఎటువంటి ప్రశ్నలు వేయకూడదు. ఆశక్తికరమైన ఏ అంశం గురించీ ఎవరితోనూ ప్రస్తావించ కూడదు." అన్న తర్ఫీదు మాజీ నాకు ఇచ్చాడు. నేను నవ్వుకున్నాను. అసలు కొత్తప్రదేశం చ[illegible], కొత్తవిషయాలు తెలుసుకోవడమే నా[illegible]బి.

నా పరిశీలనా దృష్టిని గమనించిన స్వామీజీ తన భక్తుడిగా రాలేదని గ్రహించి నన్ను ఏమీ అనలేక 'మాజీ' ని కోపగించు కున్నారని అనిపించింది.

ఆ మాటే బైటకు వచ్చాక మాజీతో అన్నాను. నామాటకు సమాధానంగా-

"పోనీ లెండి మాస్టర్ ! నా టైం బాగోలేదు. మిమ్మల్ని, స్వామీజీని కూడా బాధపెట్టాను అనవసరంగా !" అన్నాడు.

"అద్సరే గానీ వచ్చిన ప్రతీసారీ మీ గురించి శివశంకరానికి చెప్పడం, అతను మిమ్మల్ని ఒక్కసారి తనింటికి తీసుకు రమ్మని చెప్పడం, నేను మీతో అనడం, మీరేమో "ఈసారి వచ్చినపుడు చూద్దాం లెండి మాస్టర్'' అంటూ దాటేయడం జరుగుతోంది. ఈసారైనా అతని ఇంటికి వెళ్దామా ?" మాజీని అడిగాను.

''నో సార్. నా మనసెందుకో బాగుండలేదు. ఈసారికి కూడా నన్ను వదిలేయండి. మళ్ళీ వచ్చినప్పుడు అతణ్ణి తప్పక కలుస్తాను. అడిగానని చెప్పండి.

అనునయంగా ఎదుటివారిని నొప్పించకుండా మాట్లాడే మాజీ అంటే నాకందుకే చాలా ఇష్టం.

పట్నం వచ్చిన వెంటనే అతను తుని బస్ ఎక్కేశాడు.

వెళ్తూ వెళ్తూ పదిసార్లు నాకు మళ్ళీ మళ్ళీ 'సారీ' చెప్పాడు. వెళ్ళాక ఉత్తరం రాస్తానన్నాడు.

బస్ కదిలి వెళ్ళేంత వరకూ ఆగి నిట్టూర్చి, సైకిల్ స్టాండ్‌లో బైక్ తీసుకుని మెయిన్ రోడ్డు మీదకు వచ్చాను.

సరిగ్గా అప్పుడే కనపడ్డాడు శివశంకరం.

"హాయ్ శేఖర్. ఎక్కడ నుంచి వస్తున్నావ్? ఊరెళ్ళావా?"

"లేదు శివా. మాజీని బస్సెక్కించి వస్తున్నాను'' అన్నాను.

"నీకెన్నిసార్లు చెప్పానయ్యా, ఒక్క సారి మా ఇంటికి తీసుకు రమ్మనీ. ఏమైనా మీరిద్దరూ బెస్ట్‌ఫ్రెండ్స్‌లే !"

నేను నవ్వేశాను.

"మళ్ళీసారి వచ్చినప్పుడు మీ ఇంటికి తప్పకుండా వస్తానన్నాడు. అయినా మా అవసరం నీకేం ఉంటుందనీ?"

అతను దొరికిపోయినట్లుగా చూశాడు.

"భలేవాడివే! నీతో పనిలేకపోవడం ఏమిటీ? మీ ఇంటికే నేను బయల్దేరాను. నువ్వే కనపడ్డావు. మా వాళ్ళు అనుకోకుండా ఈ రాత్రికే పెద్దతిరుపతి ప్లాన్ చేశారు. నేనేమో లీవ్ పెట్టలేదు. హెచ్. ఎమ్.కి ఫోన్ చేస్తే లేరట. నువ్వు నా లీవ్‌లెటర్ ఇచ్చి కన్విన్స్ చేసి చెప్పాలి. నువ్వంటే ఆయనకి గుడ్ ఇంప్రెషన్. లేకపోతే ఒప్పుకోడు, ఛండశాసనంగాడు!"

"లీవ్ లెటర్ ఏదీ ?" అడిగాను.

''పక్కనేగా మా ఇల్లు. వస్తే రాసిచ్చేస్తాను. ప్లీజ్ శేఖర్. చూశావా నీ అవసరం నాకెంత వచ్చిందో!" అన్నాడు నా వెనుక కూర్చుంటూ

'నీ బొంద! అవసరమైతే ఎమ్మెల్యే చేత ఫోన్ చేయించి ప్రతి పనీ చిటికెల మీద చేయించుకునే వాడివి - నీకు ఇది నేను చేసి పెట్టాల్సిన పనా? ఏదో అనాలనే ముఖస్తుతికి గానీ !" అన్నాను స్కూటర్ స్టార్ట్ చేస్తూ.

"నీకన్నీ జోకులు. సర్లే. మాజీ విశేషాలు ఏమైనా చెప్పు?" అన్నాడు మాట మారుస్తూ.

శివ ఇంటికి వచ్చాము.

అతని ఇంటికి అదే మొదటిసారి రావడం. అతను ఇల్లు కట్టుకుని నన్ను కనీసం గృహప్రవేశానికి కూడా పిలవలేదు. అవకాశవాదం నిలువెత్తుపోతపోసినట్లుగా మారిపోయిన శివశంకరం అంటే అందుకే నాకు అంతగా ఇష్టం ఉండదు.

డ్రాయింగ్ రూమ్‌లో నన్ను కూర్చోబెట్టి అతను లోపలికి వెళ్లాడు.

కాశ్మీర్ టైల్స్ ఫ్లోరింగ్‌తో చాలా ప్రత్యేకంగా అమర్చి ఉందాగది.

ప్రతి అంశాన్నీ తదేకంగా పరిశీలిస్తున్న నేను ఆశ్చర్యంగా ఉండి పోయాను.

ఎదురుగా గోడకు స్వామీజీ ఫోటో.

అంటే శివశంకరం కూడా స్వామిజీ భక్తుడా?...

★★★

శివశంకరం లీవ్ లెటర్, టీతో వచ్చాడు.

"శివా! మాజీ వచ్చేది ఈ స్వామీజీ ఆశ్రమానికే. వారి ఫోటో మీ ఇంట్లో ఉందేమిటీ? మీ వాళ్ళు కూడా స్వామి భక్తులా? " అడిగాను నేను.

శివశంకరం పకపకా నవ్వేశాడు.

నా చేతికి లీవ్ లెటర్, టీ కప్పు అందించాడు.

వెళ్ళి అలమారా తాళం తీసి ఓ ఆల్బమ్‌తో తిరిగి వచ్చి నాచేతిలో పెట్టాడు.

అతనివైపు అయోమయంగా చూసిన నేను ఆల్బమ్ తెరిచి చూడసాగాను.

టీ గుటకలు వేస్తూనే.

అన్నీ కలర్ ఫోటోలు.

నా పక్కనే కూర్చున్న శివ నేను చూస్తున్న ప్రతీ ఫోటోలోని వ్యక్తులు ఎవరైందీ చెప్పసాగాడు. అందమైన యువజంటను చూపించి అన్నాడు.

" మా పెద్దనాన్నగారు, పెద్దమ్మ."

చాలా ఫోటోల్లో వాళ్ళిద్దరే ఉన్నారు. ఊటీ గార్డెన్‌లో, కన్యాకుమారి సముద్రం ఒడ్డున, తంజావూరు బృహదీశ్వరాలయంలో, చిదంబరం టెంపుల్ వద్ద, పెద్దతిరుపతిలో, మైసూర్ మహారాజా ప్యాలెస్ ముందు... ఇలా రకరకాలుగా ! ప్రతి ఫోటో ఆ దంపతుల ప్రేమానురాగాలకు చిహ్నంగా ఉంది.

"వారిద్దరికీ పిల్లలు లేరు! అవన్నీ వారి పెళ్ళయిన కొత్తల్లో హనీమూన్‌కి వెళ్ళినప్పుడు తీసినవి" అన్నాడు శివ.

తరువాత శివ, భార్య పిల్లలు 'స్వామీజీ'తో తీయించుకున్నవి ఉన్నాయి.

అందుకే నన్నుమాట శివ, మాజీని కలవాలని కోరుకు... ది. ఆ మాటే పైకి అన్నాను.

"నువ్వు పొరబడ్డావు శేఖర్, మాజీని నేను కలవాలను కుంటున్నది స్నేహ పూర్వకంగా మాత్రమే. నీవు ఊహించని విషయం చెబుతున్నాను విను! ఆ స్వామీజీ ఎవరోకాదు, మా పెదనాన్నే!"అన్నాడతను.

కొయ్యబారిపోయాను.

"చాల్చాల్లేవయ్యా ! నాతో నీకు జోకులేంటీ!" అన్నాను తేరుకుని.

శివ సీరియస్ అయ్యాడు ఉన్నట్లుండి. లేచి అటూ ఇటూ తిరుగుతూ చెప్పసాగాడు.

" నిజం శేఖర్ నువ్వు నమ్మ్మ, నమ్మకపో! ఆస్వామీజీ స్వయంగా నాకు పెద్దనాన్న! ఈ విషయాలన్నీ నువ్వు మాజీకి చేప్పేస్తావనో, లేదా నిన్ను ఫూల్‌ని చెయ్యాలనో నీకు చెప్పడం లేదు.

మా పెద్దనాన్న మా పెద్దమ్మను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇండియా అంతా నార్త్ మూడుసార్లు, సౌత్ నాలుగు సార్లు తిరిగి వచ్చారు. మూడేళ్ళపాటు వారు తిరగని ప్రదేశం లేదు. అయితే హఠాత్తుగా వారి అనురాగాన్ని భరించలేని దేవుడు యాక్సిడెంట్ పేరుతో మా పెద్దమ్మను తనతో తీసుకుపోయాడు.

పెద్దనాన్న ఆషాక్ నుంచి తేరుకోలేక పోయారు. మూడేళ్ళు ఆయన బాహ్య ప్రపంచాన్ని చూస్తే ఒట్టు. ఆ మూడేళ్ళూ ఆయనలో ఏదో కసి, తీవ్రమైన ఆవేశం. ఆ ఆవేశం అణుచుకోవడం కోసం పురాణాలు, భారత రామాయణ, భాగవత గ్రంధాలు, వాస్తు జ్యోతిషశాస్త్రాలు పుక్కిటపట్టాడు. నిద్రలో సంధి ప్రేలాపనలా ఆయన కలవరింపును చూసి నాకు చాలా భయమేసేది. రోజూ బంధువులు, చుట్టుపక్కల స్నేహితులు ఎవరో ఒకరు వచ్చి ఆయనను కనిపెట్టుకుని ఉండేవారు.

వారితో ఆయన తన అనుభవాలకు పురాణ కథలు చేర్చి చెప్పేవారు.

ఒకరు వచ్చి తన సమస్యని విన్నవించుకోవడం, ఆయన దానికి పరిష్కార మార్గం సూచించడం జరిగేది. ఒక్కొక్కప్పుడు వారిని చూస్తూనే "ఇలా చేస్తే నీకు ఫలితం ఉంటుందయ్యా!" అని తనంతట తానే వారి సమస్యను గుర్తించి సమాధానం చెప్పేవారు. దాంతో ఆయన చుట్టూ భక్తజన సందోహం పెరిగింది. అది ఊరూరా పాకింది. ప్రజలు వారంతట వారే కానుకలు సమర్పించడం మొదలు పెట్టారు. వెంకటాపురంలో అయిదెకరాలు ఒక భక్తుడు సమర్పించడంతో, యితర ప్రాంతాల భక్తులు చందాలు పోగుచేసి, ఆశ్రమాన్ని నిర్మించారు.

ప్రతి యేడు పెద్దనాన్న పుట్టిన రోజున ఆయనకు కళ్యాణం జరిపించి జన్మదిన వేడుకలు ఘనంగా చేస్తారు. అంతా నిమిత్త మాత్రుడిలా ప్రశాంత వదనంతో జరిపించుకునే ఆయన, తనను నమ్మని వ్యక్తి ఎవరైన తారసపడితే తక్షణం కోపోద్రిక్తుడై పిచ్చెక్కినట్లు ప్రవర్తిస్తారు. అందుకే అక్కడకు వెళ్ళే భక్తులు గానీ, తమతో తీసుకువెళ్ళే వ్యక్తులనుగానీ భక్తులైతేనే తీసుకువెడతారు.

పదిమందికి ఉపయోగపడటం కన్నా జీవితానికి పరమార్థం ఏముంది శేఖర్! అందుకే ఆయన ఇష్టానికి తగ్గట్లు ఆయన ఆశ్రమంలోనే ఉంటారు. నాకు పని అవసరం పడితే ఆయనను వాడుకుంటాను.

అందుచేత రుషులు అనేవారు ఎక్కడ నుంచో పుట్టరు. మన నుంచే ఉద్భవిస్తారు. అని చెప్పడానికి మా పెద్దనాన్నే ఉదాహరణ!" అన్నాడు శివ.

"నిజంశివా! ఈ దేశంలో ఎందరో స్వామిజీలు ఉన్నారు. వారిలో దైవాన్ని చూడగలిగే భక్తులతో పోలిస్తే మనం ఏపాటి? అందుకే ఎదుటి వ్యక్తిలో భగవంతుని చూడగలిగిన మాజీ మనిద్దరి కంటే గొప్పవాడు. అంతేకాదు. తన చుట్టూ చేరిన వ్యక్తులందరినీ మంచి మాటలతో భగవద్ధ్యానం వైపు మళ్ళించే ధన్యజీవి మీ పెద్దనాన్న గారు అని నా అభిప్రాయం." అన్నాను నేను ఆర్ద్రత నిండిన మనసుతో.

" నిజం శేఖర్ ! నువ్వు చెప్పింది - అక్షరాలా నిజం. పదిమందికి మంచిని మానవతా దృష్టితో పంచే స్వామీజీ, వారిలో భగవంతుని దర్శించుకుని తన జీవితానికో అర్థం కల్పించుకున్న మాజీ... నిజంగా ధన్యజీవులు. ఈ వేళ ఒక మంచి సత్యాన్ని తెలుసుకునేలా చేశావు! థాంక్స్! మరి ఉండనా!" అన్నాడు శివ 'వెళ్ళిరా' అనే అర్థంలో.

మౌనంగా ఆల్బమ్ టీపాయ్ మీద పెట్టిస్వామీజీకి నమస్కరించుకుని స్కూటర్ స్టార్ట్ చేశాను.

"కృషి ఉంటే మనుషులు రుషులవుతారు, మహాపురుషులవుతారు!" ఒక గొప్పకవి వ్రాసిన గీతం నా మనసు గాయానికి మందు పూస్తున్నట్లుగా చెవుల్లో మార్మోగుతుండగా సంతృప్తి నిండిన మనసుతో ఇంటి దారి పట్టాను.

●

'ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక'
15-09-2000